## పోలవరం ప్రాజెక్టును

# ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

**పో**లవరం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'జలయజ్ఞం'లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు. దానిని ఏ విధంగానయినా పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నాడు. దానికి ఏ అనుమతులూ లేవుకదా అంటే అనుమతుల అవసరం ఏమిటని ఒకసారి అంటాడు, ముందు పని ముగించేసుకొని ఆ తరువాత అనుమతులు తెచ్చుకోకూడదా అని ఇంకొకసారి అంటాడు. ఇదిగో అనుమతులు తెచ్చేస్తున్నామని వేరొకసారి అంటాడు.

పోలవరం కట్టదగ్గ ప్రాజెక్టయితే ఈ పట్టుదలను అభినందించవచ్చు. దానికి సహాయం కూడా అందియ్యవచ్చు. కానీ అది కట్టదగ్గ ప్రాజెక్టు కాదని మానవహక్కుల వేదిక అభిప్రాయం. ఇది అభివృద్ధి నిరోధకమైన అభిప్రాయం అని చాలామంది అనబోతారు కాబట్టి దీనిని వివరించడం అవసరం అని మేము భావిస్తున్నాం.

స్థూలంగా మూడు కారణాల వల్ల ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాలని అనుకుంటున్నాం. ఒకటి, అది ఆదివాసుల జీవితాలను పెద్దెత్తున విధ్వంసానికి గురిచేస్తుంది. రెండు, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఇప్పటికీ వెనకబడి ఉన్న ప్రాంతాలను, ప్రజలను ముంచుతుంది, నిర్వాసితులను చేస్తుంది. మూడు, ఉత్తర తెలంగాణ జిల్లాలలోని మెట్ట భూములకు తగిన మోతాదులో గోదావరి జలాలను దక్కకుండ చేస్తుంది.

పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని గురించి సమగ్రమైన నివేదిక ఇప్పటివరకు ప్రభుత్వం ప్రజల ముందు ఉంచలేదు. చేపడుతున్న కాలవల నిర్మాణానికీ ప్రకటించుకున్న ప్రాజెక్టుకూ పొంతన కనిపించడం లేదు. ప్రకటించుకున్న ప్రాజెక్టు లెక్కల ప్రకారం పోలవరం ప్రాజెక్టు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలో 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది. 975 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. 23 టిఎంసిల నీళ్లు ఎడమ కాలవ ద్వారా విశాఖపట్నం దాకా అనేక గ్రామాలకూ, పట్టణాలకూ తాగడానికి, పరిశ్రమల అవసరాలకూ ఇస్తుంది. 80 టిఎంసిల నీటిని కుడి కాలవ ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించి కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతాల నీటి అవసరాలు తీరుస్తుంది. ఈ అవసరాల కోసం పోలవరం దగ్గర నిర్మించబోయే డ్యాం నుండి అది 325 టిఎంసిల నీళ్లు తీసుకుంటుంది.

ఈ ప్రయోజనాలు సాధించడానికి ఈ ప్రాజెక్టు ఎంత విధ్వంసం సృష్టించబోయేదీ ప్రభుత్వం చెప్పడంలేదు. స్పష్టమైన సమాచారం ఇవ్వకుండ 'నిర్వాసితులను తప్పక ఆదుకుంటాం' అనీ 'నిర్వాసితులకు ఏ కష్టమూ రానివ్వం' అనీ ప్రకటిస్తున్నది. అప్పుడెప్పుడో 15 సంవత్సరాల క్రితం జరిగిన సర్వేలను బట్టి, ఈ ప్రాజెక్టు కింద మూడు జిల్లాలలో 9 ఏజెన్సీ మండలాలు ముంపుకు గురవుతాయి. 276 గ్రామాలు పూర్తిగానో పాక్షికంగానో మునుగుతాయి. అప్పటి జనాభా లెక్కల ప్రకారం ఒక లక్ష పదిహేడు వేల మంది నిర్వాసితులవుతారు.

ఆ మండలాలు పోలవరం (పశ్చిమ గోదావరి జిల్లా), దేవీపట్నం (తూర్పు గోదావరి జిల్లా), వరరామచంద్రాపురం, కూనవరం, చింతూరు, భద్రాచలం, బూర్గంపాడు, కుకునూరు, వేలేరుపాడు (ఖమ్మం జిల్లా). ఇవన్నీ ఏజెన్సీ మండలాలే. జనాభాలో దాదాపు సగం మంది ఆదివాసులు. ప్రధానంగా కోయ, కొండరెడ్డి తెగలవారు.

అప్పటికీ ఇప్పటికీ ముంపు గ్రామాల సంఖ్య పెరగకున్నా వాటిలోని జనాభా తప్పక పెరిగే ఉంటుంది. ఇప్పుడు లక్షా యాభైవేల దాకా ఉండవచ్చు. వీరికి పునరావాసం ఇస్తామని ప్రభుత్వం ఎన్ని మాటలు మాట్లాడినా వీరి జీవన ప్రమాణం ఇప్పుడున్న దానికంటే బాగా పడిపోతుందనడంలో సందేహమేమీ లేదు. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలకు తొలిసారిగా పునరావాస 'హక్కు' కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి ఏప్రిల్ నెలలో జారీచేసిన జీవో 68లో నిర్వాసితుల జీవన ప్రమాణం పడిపోకుండ చూసే సదుపాయమేదీ లేదు. తాత్కాలిక ఆర్థిక సహాయం మాత్రమే ఆ జీవో ఇస్తుంది. నిర్వాసితులు కాబోయే వారిలో సగం మంది ఆదివాసులని ముందే చెప్పాం. వారికి ఏజెన్సీలోనే పునరావాసం కల్పించడానికి భూమిలేదు, అటవీ సంరక్షణ చట్టం ఒప్పుకోదు. ఏజెన్సీ బయట వారికి పునరావాస కాలనీలు ఒకవేళ ఏర్పాటు చేసినా వారక్కడ జీవనాధారం ఇప్పుడున్న దానిలో పదవ వంతు కూడ సంపాదించలేరు. అడవి ఇచ్చే పుష్కలమైన ఉమ్మడి ఫలసాయం, రకరకాల గింజలు, ఆకులు, దుంపలు, జిగురు, తేనె మొదలైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, వంటచెరుకు, పశుగ్రాసం బయట దొరకవు. షెడ్యూల్డు ప్రాంతానికి ప్రత్యేకమైన చట్టాల రక్షణా ఇక ఉండదు.

రాజకీయంగా నోరు లేని ప్రజల జీవితాలను ఇంతటి విధ్వంసానికి గురిచేసి, ఇప్పటికే అంతో యింతో బాగున్న వారి బతుకులు ఇంకింత బాగుచేయడం కోసం కడుతున్న ప్రాజెక్టును కట్టదగ్గదిగా ఎందుకు భావించాలి?

దాని బదులు అవే గ్రామాలకు అదే నీటిని సాగునీరుగా అందియ్యడం నిజమైన అర్థంలో 'అభివృద్ధి' కాదా అని కూడా అడుగుతున్నాం. పోలవరం ప్రాజెక్టు కింద మునగబోయే 276 గ్రామాలు గోదావరి నది ఒడ్డున ఇటూ అటూ ఉన్నాయి. వాటిని దాటి కిందికి ప్రవహించి, కింద రాబోయే పోలవరం కట్ట తాకిడికి వెడల్పయి ఆ గ్రామాలను ముంచబోయే నది నీటిని, ఎత్తిపోతల ద్వారా గానీ వేరే ఏ రకంగానయినా గానీ అవే గ్రామాలకు సాగునీరుగా అందించినట్టయితే ఆ నీటిని సద్వినియోగం చేసినట్టూ అవుతుంది, మైదాన ప్రాంతాల వారి బతుకులనే కాక అడవి బిడ్డల బతుకులనూ బాగుచేసినట్టవుతుంది, అభివృద్ధిలో సమతుల్యమూ సాధించినట్టవుతుంది. బాగున్నవాళ్లను ఇంకా బాగుచేయడానికి ఏమీలేని వాళ్లను ఇంకింత నాశనం చేయడం ఏ రకమైన అభివృద్ధి?

ఈ పని చేస్తే మహా అయితే ఒక లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయేమోగానీ ఇప్పుడు కట్టబోయే ప్రాజెక్టు వల్ల ఏడు లక్షల ఎకరాల సాగు, 975 మెగావాట్ల కరెంటు వగైరా ఒనగూడుతాయి కదా అంటారేమో. 'అభివృద్ధి' అనే దానిని 'ఎంత' అనే తప్ప 'ఎవరికి' అనే ప్రశ్నతో బేరీజు వేసుకోనక్కరలేదనే ఈ వైఖరే అప్రజాస్వామికం అని మేము అంటున్నాం. టోకున ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయి, ఎన్ని ఊర్లకు నీళ్లందాయి అని మాత్రమే కాక ఎవరి భూములకు అందాయి, ఏ ఊర్లకు అందాయి అని ప్రశ్నించుకొని సమతుల్యాన్ని పెంచే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడం మెరుగయిన, ప్రజాస్వామికమైన అభివృద్ధి పంథా అని అంటున్నాం.

దానివల్ల గోదావరి జలాలలో మన వాటా నీళ్లు మనం పూర్తిగా వాడుకోక 'వృథా' కానివ్వడం జరుగుతుందని భయపడనవసరం లేదు. పోలవరం ముంపు ప్రాంతానికి ఎగువన ఇదే నీటిని వెనుకబడిన తెలంగాణ జిల్లాల కోసం ఉపయోగించడానికి తలపెట్టిన ప్రాజెక్టులు అతీగతీ లేకుండ ఉన్నాయి. 85 టిఎంసిల నీటిని వినియోగించుకోగల ఇచ్చంపల్లి ప్రాజెక్టు పొరుగు రాష్ట్రాల అభ్యంతరాల కారణంగా మొదలే కాకుండ ఉండిపోయింది. దానిని తగిన విధంగా రూపొందించే ఆలోచన చేస్తే అది సమతుల్యంతో కూడిన అభివృద్ధికి దోహదపడుతుంది. 'దేవాదుల' అనే పేరుతో మొదలయి ఇప్పుడు గోదావరి ఎత్తిపోతల పథకం అనే పేరుతో కేవలం 5 టిఎంసిల వినియోగానికి భారీగా నిర్మిస్తున్న ప్రాజెక్టు ద్వారా 50 టిఎంసిల దాకా నీళ్లు తీసుకొని కరీంనగర్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాల ఎగువ ప్రాంత భూములకు సాగునీరిచ్చే ఆలోచన ప్రభుత్వ ప్రణాళికలోనే ఉంది. దానికి వేగంగా కార్యరూపం ఇయ్యవచ్చును. ఖమ్మం జిల్లాకు విస్తారంగా నీళ్లివ్వగల దుమ్ముగూడెం ప్రాజెక్టు మీద దృష్టిపెట్టవచ్చు. వీటికంటె ఎగువన కూడ తెలంగాణ జిల్లాలకు నీళ్లివ్వగల ప్రతిపాదిత ప్రాజెక్టులు (శ్రీరాంసాగర్ వరద కాలవ, ఎల్లంపల్లి వగైరా) ఉన్నాయి గానీ అవి పోలవరంతో నీటి కేటాయింపుకు పోటీకి రాగల ప్రాజెక్టులు కావు కాబట్టి వీటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం తవ్వుతున్న కాలవలనూ ప్రాజెక్టు ఫలితాల గురించి ప్రభుత్వం చెప్తున్న మాటలనూ బట్టి చూస్తే పై ప్రాజెక్టులకు నీళ్లేమయినా ఉంటాయా అన్న సందేహం వస్తుంది. పోలవరం ద్వారా కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో ఏడు లక్షల ఇరవై ఏడువేల ఎకరాలు కాదు, 16 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఆలోచన ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటనలు తెలియచేస్తున్నాయి. గోదావరి డెల్టాలో పదిన్నర లక్షల ఎకరాల స్థిరీకరణ కూడా పోలవరం ద్వారా చేపడతామని అంటున్నారు. పోలవరం నీళ్లు ఎప్పుడొస్తాయోనని దానికి ప్రత్యామ్నాయంగా దాని ప్రతిపాదిత ఆయకట్టులోనే కొంత భాగాన్ని తడపడానికి రూపొందించిన తాడిపూడి, పుష్కరం ప్రాజెక్టులను ఒకవైపు పూర్తిచేస్తూ, మళ్లీ అదే ఆయకట్టుకు పోలవరం కాలవలు కూడా తవ్వుతున్నారు. తొలినాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రధాన కాలవ 9000 క్యూసెక్కుల ప్రవాహం కోసం నిర్మించాలని ఉండగా ఇప్పుడు 17,500 క్యూసెక్కుల ప్రవాహానికి తగినట్టు నిర్మిస్తున్నారు. చాలా వెడల్పుగా, లోతుగా నిర్మిస్తున్నారు.

దీనిని బట్టి చూస్తే పోలవరం ద్వారా 325 కాదు, 500 టిఎంసిల దాకా నీళ్లు తీసుకునే ఆలోచన ఉన్నట్టు స్పష్టం అవుతున్నది. కేవలం వ్యవసాయానికేనా లేక కోస్తా జిల్లాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అవసరాలకూ తీసుకోబోతారా అన్న సందేహాలూ ఉన్నాయి. సమాచారాన్ని ఒక హక్కుగా భావిస్తున్న ఈ రోజులలో ఈ రకమైన ఊహాగానాలు చేయడం మనకు సిగ్గనిపించినా సమాచారాన్ని దాచిపెట్టడం ప్రభుత్వానికి సిగ్గనిపించడం లేదు కాబట్టి కంటికి కనిపిస్తున్న విషయాలను బట్టి ఈ ప్రశ్నలు వేసుకోవలసి వస్తున్నది.

పూర్తయిపోయిన ప్రాజెక్టులు పోను గోదావరి జలాలలో మన రాష్ట్ర వాటా ఇంక 680 టిఎంసిలే ఉందని నిపుణుల అంచనా. అందులో 500 పోలవరం ద్వారా తీసుకునేటట్టయితే ఎగువన ఉన్న తెలంగాణ జిల్లాల అవసరాలకేం మిగులుతుంది? ప్రాంతీయ అసమానతలు అప్రజాస్వామికం అని అందరూ ఒప్పుకుంటున్నట్టు మాట్లాడుతున్న ఈ రోజులలో ఇటువంటి ప్రాజెక్టులను అంగీకరించగలమా?

పైగా, దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి మొదలయిన ప్రాజెక్టులు పోలవరం ప్రాజెక్టు భద్రతకు కూడ అవసరం అని నిపుణులు అంటున్నారు. గోదావరి నదిలో సంవత్సరంలో కొన్ని దినాలు పెద్దెత్తున ప్రవాహం ఉంటుంది. 20 లక్షల క్యూసెక్కుల నుండి 36 లక్షల క్యూసెక్కుల దాకా ఈ ప్రవాహ పరిమాణం ఉండగలదు. ఎగువన కట్టవలసిన ప్రతిపాదిత ప్రాజెక్టులేవీ కట్టకపోతే పోలవరం ఆనకట్టే నేరుగా ఈ ప్రవాహాన్ని భరించవలసి వస్తుంది. దానికది తట్టుకోలేదనీ పెద్దెత్తున విధ్వంసం జరిగే ప్రమాదముందనీ నిపుణులు అంటున్నారు. అంతా నాకే కావాలన్న ఆశపోతుతనం మన ఆరోగ్యానికి కూడ మంచిది కాదు మరి!

గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం పోలవరం ప్రాజెక్టు ముఖ్య లక్ష్యాలలో ఒకటని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. తొలినాటి అంచనాల ప్రకారం తరలించబోయేది 80 టిఎంసిలే. అందులో 35 టిఎంసిలు కర్ణాటక, మహారాష్ట్రల వాటాగా పోతాయి. ఆ మేరకు ఆ రాష్ట్రాలు కృష్ణా జలాలను ఎగువన ఆపుకుంటాయి. ఇంక మిగిలిన నీటి బదిలీ 45 టిఎంసిలే. అయినప్పటికీ ఇది రాయలసీమలోని కరువు ప్రాంత ప్రాజెక్టుల అవసరాలకు ఉపయోగపడుతుందని పోలవరం ప్రాజెక్టును సమర్థిస్తూ చేసే ఒక ముఖ్య వాదనగా ప్రభుత్వం అంటున్నది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం అంటూ జరిగితే అది రాయలసీమకే కాదు, దక్షిణ తెలంగాణకూ ఉపయోగపడుతుంది. ఉపయోగపెట్టవలసి ఉంటుంది. ఈ బేసిన్ బదిలీ గురించి బచావత్ అవార్డులో ప్రస్తావించిన చోట కృష్ణా బేసిన్ ఎగువనున్న దుర్భిక్ష ప్రాంతాల గురించి ప్రస్తావించారే తప్ప ఒక ప్రాంతాన్నో కొన్ని జిల్లాలను ప్రస్తావించలేదు. కరువు రాయలసీమలో ఉన్నట్టే దక్షిణ తెలంగాణలోనూ ఉంది. నీళ్లు రెండు ప్రాంతాలకూ కావాలి.

అయితే ఆ అవసరాల కంటె ముందు గోదావరి బేసిన్‌లోని ఉత్తర తెలంగాణకు చెందిన మెట్ట ప్రాంతాల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం న్యాయంగా ఉంటుంది. ఆ ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే లేవు కాబట్టి ఈ ప్రాధాన్యం న్యాయమైనది. దీనికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పన అరకొరగా ఉంచేసి వేరే అవసరాల గురించి మాట్లాడడం న్యాయంకాదు.

కాబట్టి ఆదివాసుల జీవించే హక్కు, వారి మనుగడ హక్కు, అభివృద్ధిలో సమతుల్యం, నీటి హక్కులలో న్యాయమైన ప్రాధాన్యం, చివరికి ప్రాజెక్టు భద్రత – దేనిని ప్రమాణంగా పెట్టుకొని చూసినా పోలవరం ప్రాజెక్టు సమర్థనీయం కాదు. కాకపోగా, దానికి అవసరమైన ఏ అనుమతులూ లేవు. నీటి లభ్యత, ఉంటే దానిని వాడుకునే హక్కు, ప్రాజెక్టు డిజైన్‌లకు కేంద్ర జలవనరుల సంఘం అనుమతి అవసరం. అది లేదు. పదివేల ఎకరాల అడవి భూమి పోలవరం ప్రాజెక్టు కింద మునగనుంది కాబట్టి కేంద్ర అటవీశాఖ అనుమతి అవసరం. దానికోసం అంతే మొత్తంలో అడవి పెంచడానికి భూమి కేటాయించడం అవసరం. అదీ లేదు. అడవితోబాటు ఆదివాసుల ఆవాసాలు మునుగుతాయి కాబట్టి కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ అనుమతి అవసరం. అది కూడ లేదు. విలువయిన జీవావరణం ముంపుకు గురవుతుంది కాబట్టి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి అవసరం. అది సహితం లేదు. ఇవేవీ లేకపోయినా, టెండర్లు పాడుకోవడానికి కాంట్రాక్టర్లుంటే చాలునని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అనుకోవచ్చును గానీ చట్టం అనుకోదు.

ఇన్ని కారణాల వల్లా పోలవరం ప్రాజెక్టు వద్దంటున్నాం. దాని నిర్మాణాన్ని ఆపాలంటున్నాం. ఇప్పటికే దానిని ఆపడానికి ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజలతో అందరం కలవాలంటున్నాం.

**3 సెప్టెంబర్ 2005**

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)

**సెప్టెంబర్ 11న జంగారెడ్డిగూడెంలో జరిగే సదస్సును జయప్రదం చేయండి.**